క్లుప్తంగా

మాలచ్చమ్మకు ఎమ్మెల్యే యరపతినేని పూజలు



దాచేపల్లి : మాలచ్చమ్మ జాతర, తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మాలచ్చమ్మ దేవాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తంగెళ్ల శ్రీనివాసరావు, బిల్లంకొండ బద్రి, అంబటి శేషగిరిరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, వగదాల భాస్కర్‌రావు, మునగా నిమ్మయ్య, సొసైటీ నారాయణ, కొప్పుల గిరి తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో ఉచిత వైద్య శిబిరం



కారెంపూడి: స్థానిక షిర్డీ సాయి, సత్యసాయి సర్వమత సేవా సదన్‌లో ఆదివారం కారెంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో రక్త నాళాలకు సంబంధించిన జబ్బుల ఉచిత వైద్య శిబిరం జరిగింది. హైదరాబాదుకు చెందిన డాక్టర్ జీవీ ప్రవీణ్ ఏషియన్ మాస్క్యులర్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ ఐ.సోమాచారి, డాక్టర్ స్వాతి రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. రక్త నాళాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 170 మంది డాక్టర్లకు చూపించుకున్నారు. వారిలో 48 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించారు. ఒక్కో రోగికి రూ.4,500 విలువైన వైద్య సేవలు ఉచితంగా అందించడం జరిగిందని, ఆపరేషన్‌లు, లేజర్ చికిత్స అవసరమైన రోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణలో వెల్దా వరలక్ష్మణరావు, కొల్లిపర వెంకట సుబ్బారావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు, గజేతి అమరయ్య, ఎస్‌పీఆర్ కృష్ణ, కిల్లా చెన్నయ్య పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.40 వేల విరాళం

అమరావతి: శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆదివారం భక్తులు సుమారు రూ.40 వేలు విరాళంగా అందించారు. ఇందులో కృష్ణా జిల్లా నిడమానూరుకు చెందిన వమిడి శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.10,116 ఇచ్చారు. ఆలయంలో అమరేశ్వరుడికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ దేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం ఈవో వేమూరి గోపీనాథశర్మకు భక్తులు విరాళాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

నకరికల్లు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ప్రధాన లైనుకు సర్వీస్ వైరు కనెక్షన్ ఇస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గుండ్లపల్లి గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన రామారావు విద్యుత్ బిల్లులు చెల్లించలేదని ఆ శాఖ వారు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. ఈ క్రమంలో రామారావు సూచన మేరకు కోపూరి నాగరాజు ప్రధాన లైనుకు సర్వీస్ వైరు జోడించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఆ సమయంలో షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా.. క్షతగాత్రుడికి డిపార్ట్‌మెంట్‌తో సంబంధం లేదన్నారు. ప్రమాదం విషయం కూడా తమకు తెలియలేదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన అవసరం



క్రోసూరు: కామన్ మ్యాన్ ఫర్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వడ్లమూడి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. బిల్లులు, కవర్లు, బ్యాగులు పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా ఉంచాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు కూడా నకిలీ కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని కోరారు.



శాకంబరీగా వాసవి కన్యక పరమేశ్వరి



శాకంబరీగా ఆదిలక్ష్మి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కరుణించమ్మా.. కల్పవల్లీ

- ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు
- అన్నదానాలు, ప్రత్యేక పూజలు

మాచర్ల: ఆషాఢ మాసంలోని బోనాల పండగ పురస్కరించుకుని పలు దేవాలయాలలో ఆదివారం శాకంబరీ అవతారంలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు శాకాంబరీగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని, గణపతి, శివుడులను ప్రత్యేకంగా కూరగాయలతో అలంకరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నెహ్రూనగర్‌లోని ఆదిలక్ష్మి దేవాలయంలో...

పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి దిగువ ప్రాంతంలో వేంచేసియున్న ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అర్చకులు, ధర్మకర్తలు నేరెళ్ల వెంకట కోటయ్య, శ్రీనివాసరావు, నిర్వాహకులు ఓబులశెట్టి వెంకటేశ్వర్లు, నన్నూరు వెంకటేశ్వర్లు, కర్నాటి వాసు, జయశెట్టి సుబ్బారావు, సురేష్‌ల ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరీగా అలంకరించి కుంకుమ పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బోనాల మహోత్సవం

పిడుగురాళ్ల: పిడుగురాళ్లలో బోనాల మహోత్సవం కొనసాగింది. కనక దుర్గమ్మ దేవాలయంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారి దేవాలయంలో ఇప్పటి వరకు నాలుగు ఆదివారాలు, మూడు సోమవారాలను పూర్తి చేసుకున్నారు. నాల్గవ ఆదివారం కావటంతో అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు పుర వీధుల్లో తిరుగుతూ... డప్పు వాయిద్యాలతో అమ్మవారికి చీర, జాకెట్ బోనాలను సమర్పించారు. ఆలయ పూజారి రావూరి పూర్ణానంద శాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అదేవిధంగా గంగమ్మ తల్లి దేవస్థానంలో బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

వైభవంగా మాలచ్చమ్మ తిరునాళ్ల

దాచేపల్లి : గ్రామ దేవత మాలచ్చమ్మ జాతర, తిరునాళ్ల మహోత్సవం ఆదివారం కనుల పండువలా జరిగింది. స్థానిక లైబ్రరీ సెంటర్‌లో వేంచేసి ఉన్న మాలచ్చమ్మ తల్లి జాతర కార్యక్రమాన్ని వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. జాతర ముగింపు సందర్భంగా అమ్మవారి తిరునాళ్లను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించిన తరువాత అమ్మవారికి సమర్పించారు.



మాలచ్చమ్మ తల్లికి బోనాలతో దేవాలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

గంగమ్మ దేవాలయంలో...



ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

గంగమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని రోపేవే కాలనీలోని కనకదుర్గమ్మ, పత్తిఫ్యాక్టరీలో శ్రీలలితాంబ, సొసైటీ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో అమ్మవారికి, మాత అన్నపూర్ణేశ్వరి, గాయత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కనక దుర్గమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పోలు వెంకటరెడ్డి మరణం పార్టీకి తీరనిలోటు

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గురజాల : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోలు వెంకటరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ వైస్ పర్సన్ పోలు పవన్మయి మామగారు పోలు వెంకటరెడ్డి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో పోలు వెంకటరెడ్డి దశ దిన కర్మలకు ఆదివారం హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పోలు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నేడు పల్నాడు జిల్లా బీఎస్పీ విస్తృత సమావేశం

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గంలో సోమవారం జిల్లా ఇన్‌చార్జి ఆధ్వర్యంలో సమావేశం జరగనున్నట్లు పల్నాడు జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ సైదులు యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఈ సమావేశం జరుగుతుందని అన్నారు. 70 సంవత్సరాలుగా దేశంలో బహుజన కులాలకు వెనుకబాటుతనంపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయటానికి ప్రత్యేకంగా ఆయా జిల్లాల సమావేశం జరుగుతుందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గ్రామాలలో శాంతిభద్రతల ఏర్పాటుకు ఐక్య విషయంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర రిటైర్డ్ డీఐజీ జె.పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వందన కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. వారు ముఖ్య అతిథులుగా పాల్గొని బహుజన సమాజ్ పార్టీని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా అధ్యక్షులు బాబురావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేరెళ్ళ రాజు, ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు, సభ్యులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుండాల సైదులు యాదవ్ కోరారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం






పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో పి.శంకర్‌రావు

ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతతోనే మనం వివిధ రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన రెంటచింతలలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. గ్రామాలలోని సైడు కాల్వలలో నున్న మంచినీటి పైపులను వెంటనే తొలగించి కాల్వలకు పైభాగంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇటీవల పలు గ్రామాలలో మురుగు నీటి కాల్వలలో నున్న పైపులైన్‌ల ద్వారా సరఫరా చేసిన మంచి నీటిని తాగడం వలన కొందరు డయేరియా బారిన పడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వర్షాకాల సీజన్‌లో విష జ్వరాలతో పాటు పలు రకాల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామాలలోని పారిశుద్ధ్య పనులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. సైడు కాల్వలలో పూడికలు తొలగించాలని.. నివాస పరిసరాలలో మురుగు నీటి నిల్వలు ఉన్నట్లయితే దోమలు ఉధృతంగా పెరిగి ప్రజలు విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మండల పరిధిలోని కార్యదర్శులు ప్రతి గ్రామంలో ఇళ్ల మధ్య మురుగునీరు లేకుండా చూడాలని, అంతర్గత రహదారులకు ఇరువైపుల నున్న సైడ్ కాల్వలపై వారం వారం బ్లీచింగ్ చల్లేల చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు సమయపాలన పాటించి అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

అచ్చంపేట: మండలంలోని పెదపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 145 మంది సభ్యులకు ఆదివారం రూ.5 లక్షల బోనస్ పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి చిరుమామిళ్ల నరసింహారావు ఈ విషయం తెలిపారు. గత ఏడాదిగా ఎక్కువ పాలు పోసిన వట్టికొండ వెంకటేశ్వర్లుకు రూ.30వేలు, పాటిబండ్ల వెంకటేశ్వర్లుకు రూ.19వేలు, పాటిబండ్ల హనుమంతరావుకు రూ.14,500 అత్యధిక బోనస్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, రెంటపాళ్ల బ్రాంచి మేనేజర్ టి.గోపి, సంఘ అధ్యక్షులు పి.వెంకట నారాయణ, సూపర్‌వైజర్ నరేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బోనస్ అందిస్తున్న సంఘ ప్రతినిధులు

కాలేయం దెబ్బతింటే ప్రాణాలకే ప్రమాదం

సత్తెనపల్లి: కాలేయం దెబ్బతింటే నయం కావడానికి సమయం పడుతుందని, ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వస్తుందని నరసరావుపేట శకుంతల వైద్యశాల అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం హాల్‌లో వైద్యులకు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలేయ వ్యాధికి చాలా మంది నాటు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. వ్యాధి ముదిరాక వైద్యుల వద్దకు వస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని కాలేయ సమస్యలు వేధిస్తున్నట్లు అంచనా ఉందన్నారు. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్ ఏ,ఈ వైరస్‌లు దరి చేరవన్నారు. పరీక్షలు, చికిత్స గురించి వివరించారు. శ్రీవిద్య వైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్ తడవర్తి శ్రీవిద్య మాట్లాడుతూ.. మలబద్ధకం, చికిత్స గురించి వివరించారు. సమావేశంలో సత్తెనపల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ జి. శ్రీధర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఐలా శ్రీనివాస్

ఎస్టీయూ రాష్ట్ర వృత్తి విద్యా కమిటీ కన్వీనర్‌గా మోహన్‌రావు

నకరికల్లు: ఎస్టీయూ రాష్ట్ర వృత్తి విద్యాకమిటీ కన్వీనర్‌గా మండలంలోని చేజర్ల గ్రామం ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు గేరా మోహన్‌రావు ఎంపికయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 28 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మోహన్‌రావుకు సముచిత స్థానం దక్కిందన్నారు. మోహన్‌రావును ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, మండల నాయకులు రాంబాబు, పరమేశ్వరరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



అచ్చంపేట: ఇంజనీరింగ్ చదువుతున్న నిరుపేద విద్యార్థి దేశిరెడ్డి లక్ష్మీపార్వతికి ఆదివారం స్నేహ హస్తాలు ఫౌండేషన్ తరపున రూ.40 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను సంస్థ సభ్యులు తుమ్మా కొండ్రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ.. విద్యార్థిని ప్రతిభతో గుంటూరులోని ఓ కాలేజీలో సీటు సాధించి బీటెక్ (డేటా సైన్స్) రెండో సంవత్సరం చదువుతోందన్నారు. మొదటి సంవత్సరంలో కూడా తామే హాస్టల్ ఫీజు చెల్లించినట్లు చెప్పారు. ప్రతిభ కలిగి పేద విద్యార్థులకు తమ సంస్థ ఆర్థిక చేయూత అందిస్తోందని తెలిపారు.

గొడవల వల్ల అన్నీ అనర్థాలే

కారెంపూడి: గొడవల వల్ల అన్నీ అనర్థాలే జరుగుతాయని అందరూ కూడా ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జీవించాలని కారెంపూడి ఎస్సై కె.అమీర్ కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని మిరియాల గ్రామంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సెంటర్‌లో గ్రామస్తులతో సమావేశమయ్యారు. గొడవల వల్ల జరిగే నష్టాలను వివరించారు. గొడవల వల్ల కేసులు అవుతాయని అవి జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాయని చివరకు పిల్లల భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారతాయని ఎవరూ గొడవలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే సైబర్ నేరాలు, చీటింగ్, దొంగతనాలు తదితర నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అమీర్

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు డ్రైవర్లకు గాయాలు
- ప్రయాణికులు సురక్షితం

నకరికల్లు: మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున సంభవించిన ఘటనకు సంబంధించిన వివరాలు... రొంపిచర్ల మండలంలోని విప్పర్ల గ్రామం వైపు నుంచి ట్రాక్టర్ మట్టిలోడుతో పిడుగురాళ్ల వైపు వెళుతోంది. సుమారు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఈ ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు నిద్రమత్తులో ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయంతో హాహాకారాలు చేశారు. సమీపంలోని హోటళ్ల వారి సహకారంతో అందరూ క్షేమంగా కిందకు దిగారు. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ నిజాంఖాన్‌కు గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి బత్తుల చినసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 సహాయంతో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాదంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పోలీసులు ట్రాక్టర్‌ను, మట్టిని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.నాగేందర్‌రావు తెలిపారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



బోల్తా పడిన ట్రాక్టర్

మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన

క్రోసూరు: మహిళా సంరక్షణ చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి మాట్లాడుతూ.. భారత న్యాయ సంహితలో సెక్షన్ 63 నుంచి 99 వరకు మహిళలు, బాలికల రక్షణకు సంబంధించి ఉన్న అంశాలను వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181 గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వి.మాధవి